# కార్మిక క్షేత్రానికి కేసీఆర్

- నేడు చెన్నూర్ నియోజకవర్గంలో 'ప్రజా ఆశీర్వాద సభ'
- రేపు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి సెగ్మెంట్లలో పర్యటన
- మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాట్లు
- గులాబీ మయమైన సభా ప్రాంగణం, చుట్టూ పక్కల ప్రాంతాలు
- నియోజకవర్గాల నలుమూలల నుంచి భారీగా జన సమీకరణ



సభా వేదికను పరిశీలిస్తున్న చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేశ్ నేతకాని

మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు(మంగళవారం) మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రికి రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే చెన్నూర్ నియోజకవర్గ 'ప్రజా ఆశీర్వాద సభ'కు కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు జరిగే సభ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో విప్ బాల్క సుమన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలను తీసుకవచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కోటపల్లి, చెన్నూర్ రూరల్, భీమారం, జైపూర్ మండలాల్లో ప్రతి ఒక గ్రామం నుంచి అలాగే చెన్నూర్ టౌన్, రామకృష్ణాపూర్ టౌన్‌లలో వార్డుల నుంచి తరలివచ్చే వారి కోసం 800 ప్రత్యేక బస్సులు, మరికొన్ని ప్రైవేటు వాహనాలను పురమాయించారు. దాదాపు 50 వేల మంది సభకు తరలించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 40 వేలకు పైగా కుర్చీలను ప్రాంగణంలో వేయించారు. సీఎం పర్యటన దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. సీఎం సభ నేపథ్యంలో సభా ప్రాంగణం చుట్టూ పక్కల ప్రాంతాలన్నీ గులాబీమయమయ్యాయి. సీఎం కేసీఆర్, చెన్నూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విప్ బాల్క సుమన్ భారీ కటౌట్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు తరలివచ్చే అశేష జనవాహిని కోసం సభా ప్రాంగణంలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్న సమయంలో సభ ఉన్న నేపథ్యంలో వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా టెంట్లు వేయించారు. తాగునీటి వసతులు కల్పిస్తున్నారు. ధూంధాం కళాకారుల కోసం సభా వేదిక పక్కనే ప్రత్యేక స్టేజీని వేస్తున్నారు. మంగళవారం ఉదయం వరకు సభా వేదిక, ప్రాంగణం పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ' కోసం మధ్యాహ్నం హైదరాబాద్‌లో హెలికాప్టర్‌లో బయల్దేరి నేరుగా మందమర్రికి చేరుకుంటారు. దాదాపు గంట పాటు ఇక్కడే ఉంటారు. అనంతరం ఇక్కడి నుంచి బయల్దేరి మంథనిలో నిర్వహించే సభకు వెళ్లనున్నారు.



వేదిక వద్ద తనిఖీ చేస్తున్న డాగ్‌స్క్వాడ్ సిబ్బంది

### రేపు మూడు సభలు..

మందమర్రిలో సీఎం కేసీఆర్ సభతోపాటు బుధవారం ఒకే రోజు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి మూడు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు ఉండనున్నాయి. రేపు సిర్పూర్‌లో మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు, ఆసిఫాబాద్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు చివరగా బెల్లంపల్లిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు సీఎం కేసీఆర్ సభలు ఉండనున్నాయి.

### ఏర్పాట్లను పరిశీలించిన చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మందమర్రి, నవంబర్ 6 : సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గం నుంచి లక్ష మందిని తరలించాలనే ప్రయత్నంలో అందుకు తగ్గట్టుగానే పాఠశాల ఆవరణలో, వాహనాల పార్కింగ్‌కు పోలీసులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, సోమవారం రాత్రి చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఏర్పాట్లను పరిశీలించారు. నాయకులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు నడక భారం తగ్గించేందుకు నలు దిక్కులా దారి సౌకర్యాలను సమకూర్చుతున్నారు. సభా వేదికకు దూరంగా ఉండే ప్రజలు సీఎం కేసీఆర్ సందేశంతో పాటు ధూంధాం కళాకారుల ఆటపాటలను వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలకు అన్ని విధాలా సహకరించేందుకు స్వచ్ఛంద వలంటీర్లను నియమించారు. సిబ్బంది సోమవారం నుంచే వేదిక, బారికేడ్ల నిర్మాణం పనులను చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజాము వరకు పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నది. హెలిప్యాడ్ నుంచి వేదిక వద్దకు వచ్చే మార్గాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. సభా వేదిక వద్ద మంచిర్యాల డీసీపీ రాంనాథ్ కేకన్, ఏసీపీలు పంతాటి సదయ్య, మోహన్, తిరుపతి రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలకు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పలు సూచనలిచ్చారు.

# కాంగ్రెస్ ఖతం

- సాజిద్‌ఖాన్, సుజాత, సంజీవ్‌రెడ్డి రాజీనామా
- కంటతడి పెట్టిన ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు
- హస్తం అధిష్ఠానానికి బుద్ధి చెబుతాం : కాంగ్రెస్ సీనియర్లు
- రెబల్‌గా మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మేనల్లుడు సంజీవ్‌రెడ్డి పోటీ

ఆదిలాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను నిజమైన కార్యకర్తలకు కేటాయించకుండా కమిషన్ల కోసం అమ్ముకున్నారంటూ జిల్లాకు చెందిన నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మేనల్లుడు, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డి, వివిధ విభాగాల నాయకులు తమ రాజీనామా పత్రాలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలకు పంపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కంటతడి పెట్టారు. 20 ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న తనతోపాటు సీనియర్లను పార్టీ విస్మరించిందని మండిపడ్డారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, డీసీసీ అధ్యక్షుడిగా వివిధ పదవులు చేపట్టిన తాను కరోనా కాలంలో ప్రజలకు సేవ చేయడమే కాకుండా.. ఐదేండ్లుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాని గుర్తు చేశారు. తనకు కాకపోతే బీసీ నాయకురాలు గండ్రత్ సుజాత, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డికి టికెట్లు ఇవ్వాలని కోరినా అధిష్ఠానం పట్టించుకోలేదని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డబ్బులకు ఆశపడి టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ కష్టకాలంలో జెండాను మోసిన తమకు మీ దగ్గర పైసలు లేవంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్ నిరాకరించారని రాజీనామాలు చేసిన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రాష్ట్ర అధిష్ఠానం పార్టీ సిద్ధాంతాలు, ఉదయ్‌పూర్, వరంగల్ డిక్లరేషన్‌లను పక్కన పెట్టి డబ్బున్న వ్యక్తులకు టికెట్లను కేటాయించిందన్నారు.

### ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు టికెట్ ఎలా ఇస్తారు?

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రాజకీయాలంటే డబ్బులు అనే ధోరణి తీసుకొచ్చారన్నారు. తమకు కాకుండా డబ్బులున్న వారికి టికెట్ ఇస్తామని చెప్పడం బాధాకరమన్నారు. కరోనా సమయంలో ఎందరో ఎన్ఆర్ఐలు జిల్లా ప్రజలకు సేవలు అందించారని, ఆ సమయంలో కంది ఎక్కడ ఉన్నారన్నారు. కేవలం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆశతో ఆదిలాబాద్‌కు వచ్చి బీజేపీలో చేరారని, అక్కడ టికెట్ రాదని తెలుసుకుని కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త అని చెప్పుకున్న కంది శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తాను సెక్యూలర్ భావాలు కలిగిన వ్యక్తిని అని ఎందుకు అనడం లేదన్నారు. డబ్బులున్న వారికి టికెట్లు ఇస్తామని ముందుగా చెబితే తాము విదేశాల్లో వ్యాపారం చేసి డబ్బులు సమకూర్చుకునే వారమన్నారు. నిజమైన వారికి టికెట్లు ఇస్తే తాను సీఎంను కాననే భావనతో రేవంత్ రెడ్డి బీజేపీ నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అధిష్ఠానానికి బుద్ధి చెబుతాం..

కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన వారిని కాదని డబ్బులకు ప్రాధాన్యం ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెబుతామని సీనియర్లు సూచించారు. పార్టీకి సేవ చేయకుండా కేవలం కుక్కర్లు పంచిన వ్యక్తికి టికెట్ ఇస్తారా? అని అధిష్ఠానాన్ని నిలదీశారు. ఇటీవల నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి దివంగత రామచంద్రారెడ్డి మేనల్లుడు సంజీవ్‌రెడ్డిని పోటీలో నిలబెట్టుకుని గెలిపించుకుంటామన్నారు. కాంగ్రెస్ కేడర్ తమతో ఉన్నారని తెలిపారు.

# వివేక్‌కు డిపాజిట్ రాకుండా ఓడిస్తాం

- ఈ ప్రాంతం నుంచి వెళ్లగొట్టడమే లక్ష్యంగా పనిచేస్తాం
- కనీసం ఓటరు లిస్టులో లేని వ్యక్తికి టికెట్ ఎలా ఇచ్చారు?
- ఏఐసీసీ చెప్పేది ఒకటి.. చేసేదొకటా?
- సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతాం.. కారును గెలిపిస్తాం
- మంచిర్యాలలో ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి బోడ జనార్దన్

మంచిర్యాల, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్‌లో కాంగ్రెస్ నుంచి పోటీలో ఉంటున్న గడ్డం వివేక్‌కు డిపాజిట్ రాకుండా ఓడిస్తామని, ఈ ప్రాంతం నుంచి ఆయనను వెళ్లగొట్టడమే లక్ష్యంగా పని చేస్తామని మాజీమంత్రి బోడ జనార్దన్ స్పష్టం చేశారు. సోమవారం మంచిర్యాలలోని తన ఇంట్లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ చెన్నూర్ కాంగ్రెస్ టికెట్ కోసం 14 మంది దరఖాస్తు చేసుకున్నామని, అందరూ వెళ్లి పని చేసుకోండి సర్వే చేయించి, గెలిచే వారికే టికెట్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. మూడో జాబితా రావడానికి ఒకరోజు ముందు వివేక్ వెంకటస్వామి బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. దానికి ముందు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నాతో మాట్లాడి.. వివేక్ జాయిన్ కావాలంటే ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిపించుకుంటామని నువ్వు స్టేట్‌మెంట్ ఇవ్వాలని, నీకు పెద్దపల్లి ఎంపీగా అవకాశం ఇస్తామని చెప్పారన్నారు. దాన్ని బట్టే నేను స్టేట్‌మెంట్ ఇచ్చానని, కానీ వివేక్ పార్టీలో చేరిన తెల్లారే చెన్నూర్ అసెంబ్లీ నాకు కావాలి, పార్లమెంట్ నా కొడుక్కి కావాలంటున్నాడని మండిపడ్డారు. ఒక కుటుంబంలో రెండు పదవులు ఇవ్వొద్దని, కనీసం రెండు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారికే టికెట్ ఇవ్వాలని చెప్పిన ఏఐసీసీ.. ఇవాళ వివేక్‌కు ఎలా టికెట్ ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ చెప్పేది ఒకటి, చేసేది మరొకటా.. అని నిలదీశారు. కనీసం చెన్నూర్ ఓటర్ లిస్టులో పేరు లేని వివేక్‌కు టికెట్ ఎలా ఇచ్చారో చెప్పాలన్నారు. అతనికి ఉంది కేవలం డబ్బేనని, వ్యాపారం చేసి డబ్బు సంపాదించి ఎన్నికల సమయంలో వచ్చి ఆ డబ్బును పార్టీకి చందాలుగా ఇచ్చి టికెట్ కొనుక్కొని ఎమ్మెల్యేగా పోటీ చేసే సంస్కృతి ఆయనదని మండిపడ్డారు. వాళ్ల అన్నకేమో బెల్లంపల్లి, అతనికేమో చెన్నూర్, కొడుక్కేమో పెద్దపల్లి ఎంపీ టికెట్, బావకు ఏమో వికారాబాద్ టికెట్ ఇచ్చారన్నారు. ఇలా మాల సామాజిక వర్గానికి రావాల్సిన సీట్లన్నీ వారికే పోయాక మిగిలిన దళితులు ఏం చేయాలి.. ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. మీ నాన్న ఎంపీగా గెలిచారు, కేంద్ర మంత్రిగా చేశారు. నువ్వు ఎంపీగా.. మీ అన్న మంత్రిగా చేసి ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని కోరారు. అన్నను చెన్నూర్‌లో ఓడగొడితే బెల్లంపల్లికి పోయాడని, ఇప్పుడు తమ్ముడిని ఓడగొడితే ఎటు పోతారో చూడాలన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయని వారికి అసలు ఓటు అడిగే హక్కు లేదన్నారు. డబ్బుల సంచులు పట్టుకొని వచ్చి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను కొనుగోలు చేసి ఓట్లు వేయించుకుంటారా అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ధ్వంద విధానం నచ్చకే తాను రాజీనామా చేస్తున్నానని చెప్పారు. మాకు జరిగిన అన్యాయం ఇంకో దళితుడికి జరగొద్దన్నారు. సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తామని చెప్పారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677